క్లుప్తంగా

గ్రావెల్ రోడ్డు ప్రారంభం



గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి

అల్లవరం: మండలంలోని రెల్లుగడ్డ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ నడింపల్లి వాసురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ గౌతమి మాట్లాడుతూ మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధల సహకారంతో గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పొన్నాడకు అభినందనలు

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నిక కావడంతో పాటు తిరుమల తిరుపతి దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యునిగా నియమితులైన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు బుధవారం పలువురు అభినందనలు తెలిపారు. తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, మండల సేవాదళ్ కన్వీనర్ భూసారపు పద్మారావు తదితరులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

బ్లడ్ కేన్సర్ బాధితునికి రూ.25 వేల సాయం



బాధిత కుటుంబ సభ్యులకు రూ.25 వేల చెక్‌ను అందజేస్తున్న రమణారావు తదితరులు

అమలాపురం టౌన్: బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న అమలాపురం రూరల్ మండలం కామనగరువు గ్రామానికి చెందిన దోనిపాటి సందీప్ వైద్య ఖర్చుల కోసం గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.25 వేలు సమకూర్చింది. విశాఖపట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందీప్ కుటుంబీకులకు ఫౌండేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం రూ.25 వేల చెక్‌ను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, కుంచే అర్జున్, నేరేడుమిల్లి శ్రీను, పరమట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ పౌర్ణమి పూజలు



శ్రావణ పౌర్ణమి పూజలు చేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి పూజలు, సాధన కార్యక్రమాలు బుధవారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి వివిధ రకాల పండ్లు, తీపి పదార్థాలతో మహా నివేదన చేశారు. అక్షయ పాత్ర సేవకులు చిక్కం జయలక్ష్మి, జంగా పార్వతి, కవరు అనసూయ, శ్రీమంతుల వీరవేణి పాల్గొన్నారు.

సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

తాళ్లరేవు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరుతూ రూపొందించిన సమరభేరి పోస్టర్‌లను స్థానిక ప్రజా సంఘాల భవనంలో సీపీఎం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, ఎం.తణుకురాజు, ఎస్.త్రిమూర్తులు, పి.సింహాచలం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం



ఆలయ నిర్మాణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

యానాం: దశాబ్దాల చరిత్ర కలిగిన యానాం శ్రీభూసమేత ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. బుధవారం ఆలయ నిర్మాణ కమిటీ సమావేశం బాలాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ పునర్నిర్మాణ పనుల గురించి చర్చించారు. సమావేశంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్, ట్రెజరర్ ఖండవల్లి రామకృష్ణ, సభ్యులు మల్లాడి శామ్యూల్, మంచాల సాయికుమార్, మొలగజ్జెల ఆనందరావు, మాజేటి మూర్తి, కాదా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళారుల గుప్పెట్లో ఓడలరేవు జెట్టీ

- అనధికారికంగా మత్స్యకారుల నుంచి కిస్తీల వసూలు
- చోద్యం చూస్తున్న జిల్లా ఉన్నతాధికారులు



ఓడలరేవు జెట్టీ వద్ద సాగుతున్న మత్స్య సంపద విక్రయాలు

అల్లవరం: వల భుజానికెక్కితేనే మత్స్యకార కుటుంబాల కడుపునిండేది. తుఫాన్లు, భారీ వర్షాలను సైతం లెక్కజేయకుండా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సముద్ర లోతు జలాల్లో చేపల వేట సాగిస్తుంటారు. అలాంటి మత్స్యకారులు ఓడలరేవు జెట్టీ వద్ద అడుగడుగునా అన్యాయానికి గురవుతున్నారు. మత్స్య సంపదను అమ్ముకోవాలంటే తమకు కిస్తీ కట్టాల్సిందేనని స్థానిక దళారులు హుకుం జారీ చేసి మరీ లక్షలాది రూపాయల్ని స్వాహా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూస్తుండడంపై తీవ్ర విమర్శలు రేగుతున్నాయి.

పంచాయతీ ఆదాయానికి గండి

విశాఖ జిల్లా నక్కపల్లి, కాకినాడ జిల్లా నుంచి ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలాల మత్స్యకారులు వేటాడిన మత్స్య సంపదను అమ్ముకునేందుకు వీలుగా ఓడలరేవు జెట్టీ నిర్మించారు. వారంతా సముద్ర లోతు జలాల్లో వేట సాగిస్తూ ఓడలరేవు జెట్టీ కేంద్రానికి మత్స్య సంపదను విక్రయించేందుకు తీసుకొస్తుంటారు. కాని అక్కడ మత్స్య సంపదను అమ్ముకోవాలంటే జెట్టీలో అనధికార వేలం పాటదారులకు కిస్తీ కట్టాల్సి వస్తుంది. స్థానికంగా ఉన్న రెండు గ్రూపులకు చెందిన దళారులు జెట్టీని తమ గుప్పెట్లో పెట్టుకుని ఏటా ఇక్కడ అనధికార వేలం పాట నిర్వహిస్తూ సొమ్మును తమ జేబుల్లో వేసుకుంటున్నారు. దీనివల్ల మత్స్యకారులంతా తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేకాదు ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన జెట్టీ వద్ద మత్స్య సంపద విక్రయాలపై వచ్చే ఆదాయం పంచాయతీకే చెందాలి. ఏటా నిర్వహించే అనధికార వేలం పాట వల్ల రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ పంచాయతీ ఆదాయం కోల్పోతుంది.

పంపకాల్లో భేదాభిప్రాయాలతో ఫిర్యాదు

ఓడలరేవు జెట్టీ వద్ద ఇటీవల అనధికార వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో వచ్చిన నగదు పంపకాల్లో రెండు గ్రూపుల్లో భేదాభిప్రాయాలు చోటుచేసుకున్నాయి. వేలం పాటలో వచ్చిన రూ.6 లక్షల సొమ్మును ఒక గ్రూపు 60 శాతం తీసుకుని మరో గ్రూపుకి 40 శాతమే ఇచ్చారు. దీంతో ఓ వర్గానికి చెందిన కోలా సహదేవుడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఇప్పుడు ఏం చేయాలోనని దళారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మత్స్యశాఖ, పంచాయతీ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తిని వివరణ కోరగా వేలం పాట నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవన్నారు. మత్స్యశాఖ ఎఫ్‌డీఓ హేమానంద్‌ని వివరణ కోరగా అనధికార వేలం పాటపై ఫిర్యాదు అందిందని విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్
- కామనగరువులో గడప గడపకూ మన ప్రభుత్వం



కామనగరువులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తుందని మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని కామనగరువులో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల జీవన ప్రమాణాలు పెంచే దిశగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సర్పంచ్ నక్కా అరుణకుమారి, రాజులపూడి మురళీకృష్ణ, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపీటీసీ మెండు గంగాభవాని, గుత్తుల అనిత తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన సదస్సు

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో బుధవారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెప్టెంబర్ 8న జిల్లా అంధత్వ నివారణ సంస్థ, యెండూరి రాఘవ నాగేశ్వరరావు ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాలు జరగనున్నట్లు ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ యెండూరి నాగేశ్వరరావు తెలిపారు. సమాజంలో ప్రతి వ్యక్తి మరణానంతరం తన నేత్రాలను దానం చేసేంత చైతన్యం పెరగాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి అప్పన హరి శివప్రసాద్, కోశాధికారి నూలు సూరిబాబు, ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ పీఆర్వో వరదా సూరిబాబు పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ పరిశీలన



మురమళ్లలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల గ్రామంలో రైతుల వరి పొలాలను ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఏడీఓ ఎంపీ రామారావు బుధవారం పరిశీలించారు. రైతు నడింపల్లి జగ్గరాజు పొలంలో ఈ-క్రాప్ నమోదును చూశారు. పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఎం.వాణి, వీఏఏ పి.శ్రీను తదితరులున్నారు.

మంత్రి, కలెక్టర్, ఎస్పీలకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



మంత్రి విశ్వరూప్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు శ్రీదేవి, స్వరూప

అమలాపురం రూరల్/అమలాపురం టౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా అమలాపురం ఓం శాంతి కేంద్రం బ్రహ్మకుమారీలు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతికి బుధవారం రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. భట్నవిల్లిలోని మంత్రి నివాసానికి స్థానిక ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి, బ్రహ్మకుమారి స్వరూప, బ్రహ్మకుమారులు ఎం.శ్రీనివాస్, జి.శ్రీనివాస్ వచ్చి మంత్రి విశ్వరూప్, ఆయన కుమారుడు డాక్టర్ శ్రీకాంత్‌కు రాఖీలు కట్టారు. అనంతరం వారు కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ సుసరాపు శ్రీధర్‌లకు వారి కార్యాలయాల్లో రాఖీలు కట్టారు. వారి నుదుట కుంకుమ దిద్ది మిఠాయిలు ఇచ్చి ఓం శాంతి సందేశాన్ని వినిపించారు.



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి శ్రీదేవి



జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ముమ్మిడివరం ఎస్‌ఐగా శివప్రసాద్



ఎస్‌ఐ శివప్రసాద్

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎస్‌ఐగా ఎస్.శివప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆలమూరు ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు పూలమాలలతో స్వాగతం పలికారు. శాంతి భద్రతలు పరిరక్షించేందుకు, దొంగతనాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని శివప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన కె.సురేష్‌బాబు అమలాపురం బదిలీపై వెళ్లారు.

గోవా పయనమైన ఎమ్మెల్యేలు

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీలోని 22 మంది శాసనసభ్యుల బృందం స్పీకర్ సెల్వం ఆధ్వర్యంలో బుధవారం గోవా బయలుదేరి వెళ్లారు. పుదుచ్చేరిలో తట్టన్‌చావిడిలో నూతన అసెంబ్లీ భవనం నిర్మిస్తున్న నేపథ్యంలో గోవా అసెంబ్లీలో ఉన్న సదుపాయాలు, మౌలిక వసతులు గురించి వారంతా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను అందించనున్నారు. యానాం నియోజకవర్గ శాసనసభ్యుడు గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సైతం శాసనసభ్యుల బృందంలో ఉన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



గాడిలంకలో పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

ముమ్మిడివరం: ఆకు నల్ల తెగులు, కాండం తొలిచే పురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త బి.భవాని సూచించారు. ముమ్మిడివరం మండలం గాడిలంకలో బుధవారం ఏర్పాటుచేసిన వైఎస్సార్ పొలం బడి కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో కలిసి ఆమె వరి పొలాలను పరిశీలించారు. స్వర్ణ, ఎంటీయూ 1318 వరి రకాల్లో ఆకునల్లి, కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించారు. ఆకునల్లి నివారణకు ప్రొపెనోఫాస్ 2 మిల్లీ మీటర్లు లేదా డైమెథోమెడ్ 2 ఎంఎల్ మందును 5 ఎంఎల్ వేప నూనె, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఏఓ ఎస్.ప్రశాంతకుమార్, బి.బలరామ్ తదితరులున్నారు.

మృతుడు కృష్ణసూర్యభగవాన్‌కు నివాళులు

యానాం: విశాఖ జిల్లా అనకాపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దొమ్మేటిపేటకు చెందిన దొమ్మేటి కృష్ణ సూర్యభగవాన్ మృతదేహానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆయన దొమ్మేటిపేట మృతుని స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు కృష్ణభగవాన్ భౌతికదేహానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తదితరులు నివాళులర్పించారు.

ఆధార్‌తో అనుసంధానం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ మధుసూదనరావు

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలందరినీ ఈ నెలాఖరు లోగా ఆధార్‌తో అనుసంధానం చేయించాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్‌రావు ఆదేశించారు. సెప్టెంబర్ 1 నుంచి ఆధార్‌తో అనుసంధానమైన కూలీలకు మాత్రమే వేతనాలు పడతాయన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఏపీఎం బొంతు చంద్రమోహన్ అధ్యక్షతన పి.గన్నవరం క్లస్టర్ పరిధిలోని 8 మండలాలకు చెందిన ఏపీఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లా లో ఇప్పటికే 98 శాతం కూలీలను ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగిలిన వారిని కూడా చేయించాలని, లేకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించాలని, కొత్తగా చేపట్టాల్సిన పనులను గుర్తించి, ప్రతిపాదనలు సిద్ధం చేయా లని ఆదేశించారు. ఎంపీడీఓ ఎం.భారతి, ఏపీడీ జి. కవిత, ప్లానిటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్ పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.లక్ష విరాళం

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాత శేషుబాబు పి.మల్లవరం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌కు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. శేషుబాబు తన తల్లిదండ్రులు వనిమిశెట్టి నాగేశ్వరరావు, పొన్నమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.లక్ష చెక్కును ధూళిపూడి నాగేశ్వరరావు చేతుల మీదుగా హెచ్ఎం శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు సారె పంపిణీ



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు ఓం శాంతి సందేశ చిత్రపటాన్ని అందిస్తున్న బ్రహ్మకుమారీలు



ఎమ్మెల్యే పొన్నాడకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

అమలాపురం టౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా అమలాపురం ఓం శాంతి కేంద్రం బ్రహ్మకుమారీలు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు రాఖీ కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ ఇంటికి ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి, బ్రహ్మకుమారి స్వరూప బుధవారం వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. ఎమ్మెల్యే పొన్నాడ దంపతులను ఆశీర్వదించి వారికి ఓ శాంతి సందేశ చిత్రపటాన్ని బహూకరించారు.

ముమ్మిడివరం/తాళ్లరేవు: మహిపాల చెరువు గ్రాండ్ పార్కులో బుధవారం రాఖీ పండగ పురస్కరించుకుని నియోజకవర్గంలోని అక్కాచెల్లెమ్మలు ఎమ్మెల్యే పొన్నాడకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సుమారు మూడు వేలమంది మహిళా వలంటీర్లు, ఉద్యోగులు, కార్యకర్తలకు చీరలు పెట్టి పుట్టింటి సారె అందజేశారు. ఎమ్మెల్యే పొన్నాడకు రాఖీ కట్టేందుకు తాళ్లరేవు మండలం నుంచి మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు, యానిమేటర్లు, ఆశా వర్కర్లు, ఏఎస్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఎంపీపీ రాయుడు సునీత, వైఎస్ ఎంపీపీ కొపనాతి లలిత, మార్తభీమాబాయి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కాపవరపు శ్రీదేవి, సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి తదితరులు ఎమ్మెల్యే పొన్నాడకు రాఖీలు కట్టారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉద్యోగులను సత్కరించిన నాయకులు

అల్లవరం: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉద్యోగులను బుధవారం బోడసకుర్రు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో సత్కరించారు. వీఆర్‌ఓ గెద్దాడ సత్యనారాయణ, వీఆర్ఏ తొండవరపు దుర్గారావు, పారిశుధ్య కార్మికుడు సాపే గణపతిరావు, బదిలీపై వెళ్లిన సర్వేయర్ హేమలను శాలువాలు, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బస్వాని పద్మ, ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, మట్టపర్తి షణ్ముఖరావు, దొమ్మేటి శ్యాంప్రకాష్, చెల్లుబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్ల పెన్ డౌన్



మంత్రి విశ్వరూప్‌కు వినతి పత్రం అందిస్తున్న దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు

అమలాపురం టౌన్: రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశపెడుతున్న ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ అమలాపురం రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పనిచేసే దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు పెన్‌డౌన్ ద్వారా బుధవారం నిరసన తెలిపారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రిజిస్ట్రార్ రత్నకుమార్‌కు అందజేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ భట్నవిల్లిలోని మంత్రి స్వగృహానికి మంగళవారం రాత్రి వెళ్లి మంత్రి పినిపే విశ్వరూప్‌కు వినతిపత్రం అందించారు. విశ్వరూప్‌ను కలిసినవారిలో దస్తావేజు లేఖర్లు గనిశెట్టి భోగిరాజు, మట్టపర్తి రాము, స్టాంపు వెండర్లు వెలుతురుపల్లి సుబ్బు, మాగాపు కామేశ్వరరావు తదితరులున్నారు.

విద్యుత్ తీగలపై పాదుల తొలగింపు

సాక్షి స్పందన



కూనవరంలో కరెంటు స్తంభంపై పాదులను తొలగిస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: విద్యుత్ తీగలపై అల్లుకున్న పాదుజాతి కలుపు తీగలను విద్యుత్ సిబ్బంది బుధవారం తొలగించారు. మండలంలోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు, తీగలకు కలుపు మొక్కలు పెరిగిపోయిన పరిస్థితిని వివరిస్తూ 'నిలువెల్లా అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కూనవరం, భీమనపల్లి పంచాయతీ పరిధి సూదాపాలెం గ్రామాల్లో పాదు తీగలను తొలగించి శుభ్రం చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

లబ్ధిదారుల గుర్తింపు కోసం శిబిరం

యానాం: కోల్‌కతాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకోమోటార్ డిజేబిలిటీస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని శారీరక, బధిర, విభిన్న ప్రతిభావంతులకు సహాయపరికరాల పంపిణీ కోసం గుర్తింపు శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లంకె ప్రసన్న మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన సహాయపరికరాలను భారత ప్రభుత్వ సామాజిక, న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ ఆర్థిక సహకారంతో అందిస్తున్నామన్నారు.

ఘనంగా టూరిజం క్లబ్ కార్యక్రమాలు

ఐ.పోలవరం: ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రాజమండ్రి ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్ కార్యక్రమాలు ఐ.పోలవరం జెడ్పీ పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నివారణ, స్వదేశీ వస్తువుల వాడకం, సైకిల్ రేస్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పరికరాల తయారీ తదితర అంశాలపై రీజనల్ డైరెక్టర్ ఒంటిద్దు స్వామినాయుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టూరిజం అధికారి పి.వెంకటాచలం, హెచ్ఎం వీధి సురేష్‌బాబు, ఎం.శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అల్లవరం: ఓడలరేవులో కొబ్బరి చెట్టు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మోకా నరసింహారావు(48) బుధవారం మృతి చెందారని ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో నరసింహారావుకు తీవ్ర గాయాలు కాగా అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఘటనపై నరసింహారావు కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇమ్మిడివరప్పాడులో శాటిలైట్ సెక్రటేరియట్

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడు గ్రామంలో నూతనంగా శాటిలైట్ సెక్రటేరియట్‌ను జెడ్పీటీసీ సభ్యుడు పందిరి హరిరామ్‌గోపాల్, సర్పంచ్ రేలంగి దుర్గారావు ప్రారంభించారు. సచివాలయం దూరమై ఇమ్మిడివరప్పాడు ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక నాయకులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామ ప్రజల కల సాకారమైంది. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, కార్యదర్శి రెడ్డి శిరీష, కన్నెపాముల సూర్యనారాయణ, తోట వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీస్వామి ఆలయంలో ఇన్వర్టర్ ఏర్పాటు



పాత బాలాజీస్వామి గుడిలో ఇన్వర్టర్‌ను ప్రారంభిస్తున్న ఈఓ మాధవి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి పాత ఆలయంలో స్టీల్ క్యూలైన్ ఏర్పాటుకు నగరం గ్రామానికి చెందిన రొక్కాల రాజారావు, వారి కుటుంబ సభ్యులు బుధవారం రూ.90 వేలు సమర్పించారు. రూ.20 వేలతో ఇన్వర్టర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ వీటిని ప్రారంభించారు. దాతతో పాటు వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా శ్రీబాల బాలాజీ స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయ దేవేరులతో కొలువు దీరిన స్వామి వారిని దర్శించుకున్నారు.